పురంలో మురుగు సమస్య!

- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఎప్పటికో...
- జిల్లా కేంద్రంలో మురుగు సమస్య
- అధ్వానంగా కాలువలు
- దుర్వాసన, దోమలతో స్థానికులు సతమతం
- ఎన్నికల వేళ అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి హామీ ఇచ్చిన కూటమి నేతలు
- ఆ మాటలు నేడు ఏమయ్యాయంటూ ప్రజల నిలదీత


పార్వతీపురం పట్టణ రహదారిపై మురుగు

పార్వతీపురం టౌన్:

మన్యం జిల్లా కేంద్రం ఏడాదిగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. తాగునీరు, డంపింగ్ యార్డు, వరహాల గెడ్డ ముంపు, అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ ఉండంతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నికల ముందు ప్రస్తుత ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పట్టణానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏడాది కాలంలో నిర్మిస్తామని హామీనిచ్చారు. ఇచ్చిన హామీ ఆచరణకు నోచుకోలేదు. దీంతో పట్టణ ప్రధాన రహదారి, పలు వీధుల ప్రజలు దుర్వాసన, దోమలతో సతమతమవుతున్నారు. ఏడాది పూర్తి చేసినా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు వైపు ఒక్క అడుగు కూడా పడలేదు.

పట్టణ జనాభా 62 వేలు పైచిలుకు ఉండగా 30 వార్డులు, 110కి పైగా వీధులు ఉన్నాయి. జిల్లా కేంద్రంగా ఉన్న పార్వతీపురం పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చెందకపోవడంతో దోమల బెడద అధికమై పట్టణ వాసులు రోగాల బారిన పడుతున్నారు. అవసరం మేరకు పట్టణంలో మురుగు


ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద రోడ్డుపై మురుగు

కాలువల మరమ్మతులు చేపట్టకపోగా ఉన్న వాటిలో క్రమబద్ధత లేకపోవడంతో రోజు రోజుకూ సమస్య జటిలంగా మారుతోంది. చిన్నపాటి వర్షానికి సైతం మురుగు రోడ్డుపై చేరి వాహన చోదకులకు, స్థానికులు ఇబ్బందులకు గురవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ బస్టాండ్, ప్రధాన రహదారి, ఇందిరా కాలనీ, గొల్ల వీధి, బెలగాం, మార్కెట్ యార్డు, లెప్రసీ కాలనీ, గూడ్స్‌షెడ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో మురుగు రోడ్డుపైకి రావడం నిత్యం జరుగుతూనే ఉంది. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్ వర్షం పడితే చెరువును తలపిస్తుంది.

కాలువలపై అక్రమ కట్టడాలతోనే..

పట్టణంలో కాలువలపై అక్రమ కట్టడాలు అధికం కావడంతో ప్రధాన రహదారిపై, పలు వార్డుల్లో మురుగు కాలువలు మూసుకుపోయి సమస్య మరింత జటిలంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో మురుగు కాలువలను పూడ్చివేశారు. దీంతో మురుగు, వర్షపు నీరు పోయేమార్గం లేకుండా పోయింది. మరికొన్ని వార్డుల్లో కాలువల్లో పూడికలు తీయకపోవడం వల్ల మురుగు వీధుల్లో చేసి దుర్గంధం ప్రబలుతుంది.

ఇరుకైన రోడ్లు...

ఇళ్ల ముందు రోడ్లను ఆక్రమించి మెట్లు నిర్మించుకోవడంతో పాటూ, మొక్కలు నాటుకోవడంతో వీధులు ఇరుకుగా మారాయి. దీంతో ఆటో వాలాలు, వాహన చోదకులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిస్తే పట్టణ నడిబోడ్డున ప్రవహిస్తున్న వరహాల గెడ్డ ముంపు ప్రాంతంమైన బైపాస్‌కాలనీ వాసులు బిక్కుబిక్కుమంటూ జీవనం కొనసాగిస్తున్నారు.


అధ్వానంగా గూడ్స్ షెడ్ రహదారిపై కాలువ

దోమల బెడదతో..



మా వార్డులో కాలువల్లో మురుగు ఎక్కువగా ఉండంతో ఇబ్బందులకు గురవుతున్నాం. వర్షం పడితే నీరు గుంతల్లో చేరి దోమలు ఎక్కువవుతున్నాయి. ఈ సమస్యపై అధికారులకు ఎన్నోమార్లు వినతిపత్రం అందజేసినా పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. కానీ అమలు కాలేదు.

– పాలకొల్లు పార్వతీ, పార్వతీపురం పట్టణం

చిన్నపాటి వర్షానికే..



పట్టణ ప్రధాన రహదారిపై చిన్న పాటి వర్షానికి సైతం రోడ్డు జలమయమవుతుంది. రహదారిపై మురుగు చేరి వాహనాలపై వెళ్లాలంటే భయం వేస్తుంది. ప్రతీ వర్షాకాలంలో ఇదే పరిస్థితి. రహదారిపై ఆక్రమణలు తొలగించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. మున్సిపల్ అధికారులు సమస్యకు పరిష్కారం చూపాలి.

– కృపారావు, ఆటో వాలా, పార్వతీపురం

అక్రమ సస్పెన్షన్లు ఎత్తేయాలి..

- కరాసవలస కేజీబీవీ సిబ్బందిపై చర్యలు తగవు
- కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జేఏసీ డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జేఏసీ నేత రమణ

పార్వతీపురం టౌన్: కరాసవలస కేజీబీవీ సిబ్బందిపై విధించిన అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలని కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకుడు బీవీ రమణ డిమాండ్ చేశారు. సుందరయ్య భవనంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వివిధ ప్రభుత్వ పథకాలు సంస్థలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పట్ల వేధింపులు పెరిగాయని, చిన్న చిన్న కారణాలతో తొలగింపులకు, సస్పెన్షన్లకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేకమంది ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోఏ.లు మధ్యాహ్న భోజన నిర్వాహకులను, మున్సిపల్ కార్మికులను అకారణంగా తొలగించారని ఇప్పుడు కేజీబీవీ సిబ్బంది వంతు వచ్చిందని విమర్శించారు. సాలూరు మండలం కరాసవలస కేజీబీవీలో మంత్రి పర్యటన సందర్భంగా విద్యార్థులకు పెడుతున్న ఆహారం వంటలో నాణ్యత లోపించిందని గుర్తించారని, దానికి హెచ్చరిస్తే సమసిపోయే సమస్యను కారణంగా చూపించి ఏకంగా ఎస్‌వోతో పాటు నలుగురు వంట సిబ్బందిని సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అధికారుల పరిశీలనలో ఎస్‌వో ప్రమేయం లేకపోయినప్పటికీ ఆమెను బాధ్యునిగా చేసి సస్పెండ్ చేయడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, అధికారులు ఉద్యోగులతో సామరస్య పూర్వకంగా సక్రమంగా విధులు నిర్వహించేలా చూడాలి తప్ప ఇలా వేధింపులకు పాల్పడి, భయభ్రాంతులకు గురి చేయడం సమంజసం కాదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కరాసవలస కేజీబీవీ సిబ్బందిపై విధించిన సస్పెన్షన్ తక్షణమే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ సమస్యపై ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు గొర్లి వెంకటరమణ, బంకురు సూరిబాబు పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యే గాలి వ్యాఖ్యలు దుర్మార్గం


ఎంపీపీ మజ్జి శోభారాణి

పార్వతీపురం రూరల్: మాజీ మంత్రి ఆర్కే రోజాపై నగిరి టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేసిన అనుచిత వ్యాఖ్యలను పార్వతీపురం ఎంపీపీ మజ్జి శోభారాణి శనివారం తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే భాను ప్రకాష్ చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమన్నారు. ఒక మహిళపై ఈ తరహాలో మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కనీస ఇంగిత జ్ఞానం కూడా లేకుండా బాధ్యత గల ఎమ్మెల్యే పదవిలో ఉండి బాధ్యతా రహితంగా మాట్లాడిన భానుప్రకాష్‌ను చంద్రబాబు పార్టీ నుంచి సస్పెండ్ చేసి క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందిస్తున్న రోజాను కట్టడి చేయాలన్న ఆలోచనతో ఏదేదో మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో హోం మంత్రిగా ఒక మహిళ ఉండి కూడా మహిళలకు భద్రత, గౌరవం లేని పరిస్థితుల్లో ఈ రాష్ట్రం ఉండడం దురదృష్టకరమన్నారు.

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత


జిల్లా పోలీసు శాఖ కార్యాలయ ఆవరణంలో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న పోలీసుశాఖ అధికారులు

పార్వతీపురం రూరల్: భవిష్యత్ తరాల భద్రత కోసం పచ్చదనం–పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి అన్నారు. ప్రతీ నెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసుస్టేషన్లలో సిబ్బంది ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు కార్యాలయాల వద్ద పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. ఈ మేరకు శనివారం ఉదయం జిల్లా పోలీసు శాఖ కార్యాలయ ఆవరణలో పరిసర ప్రాంతాలను అలాగే డీసీఆర్‌బీ, ఎస్‌బీ, కమ్యూనికేషన్, మహిళ సెల్ తదితర కార్యాలయాల ప్రాంగణాల చుట్టూ ఉన్న పరిసరాలను స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎస్పీ పిలుపు మేరకు ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఏఆర్ఐలు నాయుడు, శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలకు సర్పంచ్‌ల డుమ్మా!


మక్కువ గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో స్వరూపరాణి

మక్కువ: మండలంలోని అన్ని పంచాయతీల్లో శనివారం ఎంపీడీవో డిడి.స్వరూపరాణి ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభలను నిర్వహించారు. అయితే గ్రామ సభలకు సర్పంచ్‌లెవ్వరూ హాజరుకాలేదని పలువురు చర్చించుకుంటున్నారు. మండలంలోని 21పంచాయతీల్లోని 18పంచాయతీల్లో వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు, ఎ.వెంకంపేట పంచాయతీలో బీజేపీ సర్పంచ్ ఒకరు పాలన సాగిస్తున్నారు. అధికారులు నిర్వహించిన గ్రామసభలకు సర్పంచ్‌లెవ్వరూ హాజరుకానట్టు తెలిసింది. గ్రామసభ నిర్వహించాలంటే వారం రోజులు ముందుగా ప్రజాప్రతినిధులకు, అధికారులు సమాచారం అందించాల్సి ఉంది. అయితే ఒక్కరోజు ముందుగా ప్రత్యేక గ్రామసభ నిర్వహిస్తున్నామంటూ, హాజరు కావాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇచ్చినప్పటికీ పలు కారణాల వలన గ్రామ సభలకు సర్పంచ్‌లు డుమ్మా కొట్టినట్టు తెలుస్తుంది. సర్పంచ్‌లు గ్రామసభలకు హాజరు కాకపోవడంతో అధికారులు ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించి, సాదాసీదాగా గ్రామసభను ముగించారు.

పచ్చ చొక్కా వాళ్లకే పనులు చేస్తారా..!


తహసీల్దార్ కార్యాలయంలో టీడీపీ నేతను పక్కన కూర్చొబెట్టుకొని పని చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పార్వతీపురం రూరల్: రెవెన్యూ కార్యాలయాలకు సామాన్యులు ఏదైనా పని నిమిత్తం వెళ్తే ఆ పని అయ్యే సరికి చెప్పులు అరిగిపోవాల్సిందే.. కానీ పచ్చ రంగు చొక్కాలు వేసుకునే వారికి మాత్రం రెవెన్యూ కార్యాలయాల్లో అధికారులు తమ పక్క సీట్లలో కూర్చొబెట్టి మరీ వారెదురుగా ఆఘమేఘాల మీద పనులు చేస్తారు. పార్వతీపురం తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఓ టీడీపీ నేతను పక్కన కూర్చొబెట్టుకొని కంప్యూటర్‌లో పనులు చేస్తూ ఉన్న ఫొటో స్థానికంగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అధికారుల తీరు చర్చనీయాంశమైంది. సామాన్యులకు కూడా ఇలాగే పనులు చేసి రెవెన్యూ సిబ్బంది తమ ఉదారతను చాటుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం


చంద్రబాబు మోసాలకు సంబంధించిన క్యూఆర్ కోడ్ పత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, పార్టీ నాయకులు


సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

సీతానగరం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రజలను మోసం చేస్తుందని, మోసపోయిన ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ ప్రజా పోరాటానికి నడుం బిగించిందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండల కేంద్రంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు అధ్యక్షతన శనివారం జరిగింది. ఇందులో మాజీ ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో ఎన్నికల వేళ ప్రకటించిన మేనిఫెస్టో అమలు చేయకుండా మోసం చేస్తున్నారన్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ అన్నట్టు కూటమి పాలన తయారైందన్నారు. బాబు మోసాలను ప్రజలకు క్షేత్ర స్థాయిలో వివరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మేలు.. కూటమి పాలనలో ప్రజలను వంచిస్తున్న తీరు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ నెల 21 నుంచి గ్రామాల్లో నిర్వహించబోయే కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కూటమి పాలకుల దమన నీతిని ఎండగట్టాలన్నారు. చంద్రబాబు 13 నెలల పాలనలో ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర తీస్తున్నారని ధ్వజమెత్తారు. అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలే కూటమి నాయకులకు ప్రశ్నించేలా జాగృతం చేయాలన్నారు. ఈ సందర్భంగా బాబు మోసాలకు సంబంధించి క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఎంపీపీ బి.రమణమ్మ, మహిళా విభాగం అధ్యక్షురాలు డి.నాగరత్నం, యువజన విభాగం అధ్యక్షులు దాసరి కిశోర్‌కుమార్, మాజీ ఎంపీపీ పాత్రుడు, పంచాయతీ విభాగం కార్యదర్శి ఎస్.రామకృష్ణ, కె.రత్నాకర్, రైతు విభాగం రాష్ట్ర నాయకులు ఆర్వీఎం ధనంజయ్, బంకురు శంకరరావు, పి.ఈశ్వరనారాయణ, బి.సూర్యనారాయణ, కిరణ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

25న కురుపాంలో జాబ్‌మేళా

పార్వతీపురం టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25న కురుపాంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణచైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదువుకొని 18 నుంచి 28 సంవత్సరాల వయసు ఉన్నటువంటి నిరుద్యోగ యువతి, యువకులకు ఉదయం 9 గంటల నుంచి కురుపాం ఎస్‌వీ కిషోర్‌చంద్ర దేవ్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. జాబ్ మేళాలో 11 కంపెనీల ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ మరియు యువకులకు తమ వివరాలను https://naipunyam.a p.gov.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. రిఫరెన్స్ నంబరుతో పాటు రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల ఒరిజినల్, జెరాక్స్ కాపీలను పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 6303493720, 8978878557 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

డ్రమ్ సీడర్ విధానంలో వరి నాట్లు


డ్రమ్ సీడర్ ద్వారా వరి నాట్లు నాటుతున్న రైతు

సాలూరు రూరల్: మండలం మరిపల్లి పంచాయతీ రేగాపువలస గ్రామంలో ఏవో కె.శిరీష పర్యవేక్షణలో శనివరాం వరి నాట్లు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రమ్ సీడర్ విధానంలో ఎకరానికి 8 నుంచి 10 కేజీల విత్తనాన్ని 24 గంటలు నానబెట్టి 12 గంటల మండి గట్టి చిన్న మొలకలు వచ్చిన తరువాత బాగా దమ్ము పట్టిన పొలంలో విత్తనాలు డ్రమ సీడర్ ద్వారా వేసుకోవాలని సూచించారు. డ్రం సీడర్ ద్వారా విత్తనాలు నాటడం వలన ఎకరానికి రూ.8 నుంచి రూ.10 వేలు వరకు ఖర్చు తగ్గుతుందని అన్నారు. ఏఈవో శ్రీను రైతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామకంఠం స్థల ఆక్రమణపై చర్యలేవి?


షెడ్ నిర్మాణ పనులు ఆపేయాలని తలయారీకి చెబుతున్న ఎంటీపీసీ సీతారాం, గ్రామస్తులు

సాలూరు రూరల్: మండలంలోని మరిపల్లి గ్రామంలో రామమందిరానికి ఎదురుగా గ్రామకంఠం భూమిని వీఆర్‌ఏ కె.ఈశ్వరరావు ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపట్టారు. దీనిని తక్షణమే నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎంపీటీసీ జన్నిసీతారాం, సర్పంచ్ టి.నారాయణమ్మ, గ్రామస్తులు పలువురు తహసీల్దార్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు.

దీనిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై గ్రామ ప్రజాప్రతినిధులతో పాటు గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సామాజిక అవసరాలకు ఉపయోగపడే స్థలంలో వీఆర్‌ఏ అక్రమంగా నిర్మాణం చేపట్టినా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడాన్ని ప్రశ్నిస్తున్నారు. తక్షణమే నిర్మాణాన్ని నిలిపివేయించాలని శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

మొక్కలను సంరక్షిస్తేనే సత్ఫలితాలు

సీతానగరం: గ్రామాల్లో నాటిన మొక్కలు సంరక్షించేనపుడే అన్ని విధాలుగా ఫలితాలిస్తాయని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇటీవల నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో మొక్కలు విరివిగా మొక్కలు నాటడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా సమకూర్చిన మొక్కలు నాటినప్పుడే ఎవరెవరు మొక్కలు నాటారో వారే మొక్కలు సంరక్షణా బాధ్యతలు తీసుకోవాలని కోరామన్నారు. నాటిన కొబ్బరి మొక్కలు సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె.కుమారవర్మ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఏఎంవో

బలిజిపేట: పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏఎంవో కోటేశ్వరరావు అన్నారు. బలిజిపేట ఉన్నత పాఠశాలలో క్లస్టర్ ఉపాధ్యాయుల సమావేశాన్ని ఆయన శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం, వారిని సంసిద్ధులుగా తయారు చేయడం, వారికి రాత, చదువు వచ్చే విధంగా విద్యను నేరిఫ్పంచడం చేయాలని సూచించారు. విద్యావ్యవస్థలో వచ్చే మార్పులకు అనుగుణంగా ప్రతీ ఉపాధ్యాయుడు వారి పరిధిలో ఉండే పాఠశాల విద్యార్థిని తీర్చిదిద్దాలన్నారు. ప్రతి పాఠశాలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏపీవో హరిప్రసాద్, క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటనాయుడు, సహ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొజిషన్ ఐడీలు ఇవ్వకపోవడం శోచనీయం

పార్వతీపురం టౌన్: ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియలో కొత్త పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులకు రెండు నెలలైనా పొజిషన్ ఐడీలు రాకపోవడం వలన రెండు నెలల నుంచి జీతాలు కాలేదని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు ఎస్.మురళీమోహనరావు అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలు, క్లస్టర్ పాఠశాలల్లో నియమించిన ఉపాధ్యాయుల పోస్టులు ఆర్థిక అనుమతి తెప్పించుకోవడంలో రాష్ట్ర అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. రెండు నెలల నుంచి జీతాలు వేయకపోవడం వలన ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే పొజిషన్ ఐడీలు ఇవ్వాలని లేకుంటే పోరాటం చేస్తామని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ ఆకుల రాజు

పార్వతీపురం టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పట్టణ పరిశుభ్రత కోసం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత మన్యం జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులంతా తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం కళాశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో తెర్లి రవికుమార్, అధ్యాపకులు శర్మ, లక్ష్మణరావు, తేజ తదితరులు పాల్గొన్నారు.

పనుకు చెరువు గండి పూడ్చాలి


గండి పడిన చెరువును పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి

మక్కువ: మండలంలోని తూరుమామిడి గ్రామం పనుకు చెరువుకు ఏర్పడ్డ గండిని అధికారులు తక్షణమే పూడ్చివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. గండి పడిన చెరువును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన కురిసిన వర్షానికి పనుకు చెరువుకు గండి పడిందన్నారు. ఈ ఏడాది వీఆర్ఎస్ పరిధిలో ఉన్న కాలువలు, చెరువులు వద్ద మరమ్మతుల పనులు జరిపించకపోవడంతో, కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకు గండ్లు పడుతున్నాయన్నారు. ఖరీఫ్ సీజన్ తొలిదశలో ఈ విధంగా గండ్లు పడుతుంటే, ముమ్ముందు పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం కావడం లేదన్నారు. పనుకు చెరువు కింద సుమారు 200ఎకరాలు ఆయకట్టు ఉందన్నారు. అధికారులు సత్వరమే స్పందించి, గండి పూడ్చకపోతే రైతులు నష్టపోయే పరిస్థితి ఉందన్నారు.


రావికోనకు వెళ్లే మార్గంలో రహదారి మధ్యలో ఏర్పడిన భారీ గొయ్యి


మండలంలోని పలు గ్రామాలకు వెళ్లేందుకు ఉన్న గోరీల జంక్షన్ వద్ద రహదారి ఇలా..

అడుగుకో గుంత..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్ల అభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇచ్చామని ఆ పార్టీల నేతలు గొప్పలు చెబుతున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో వాస్తవాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయని చెప్పడానికి ఈ చిత్రాలే సజీవ సాక్ష్యాలు. పార్వతీపురం మండలంలోని గిరిజన గ్రామాలతో పాటు రావికోన, చినబొండపల్లి, కొత్తపట్నం, చొక్కాపువానివలస, లక్ష్మీనారాయణపురం, సంగంవలస, సీతంపేట మరికి గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాలకు వెళ్లే రహదారులు పెద్ద గోతులతో రాళ్లు తేలి పాదచారులకు సైతం అవస్థలకు గురి చేస్తున్నాయి. దీంతో రాకపోకలు ప్రమాదకరంగా మారాయి.

– పార్వతీపురం రూరల్